క్లుప్తంగా

అంతా కలసిమెలసి సాగుదాం..



సభ్యులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర

బోట్‌క్లబ్‌: మానవజాతి అంతా పెద్ద కుటుంబమని కాకినాడ ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నాగేంద్ర అన్నారు. స్థానిక ఆనంద భారతి వద్ద రవి దంత వైద్యశాలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ కుటుంబ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులందరికీ మొక్కలు అందజేశారు. డాక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులంతా కుటుంబ సభ్యుల్లా కలసి మెలసి సాగుతామని, ఈ సంవత్సరం సమాజ సంక్షేమ కార్యక్రమాలు చేపడతామన్నారు. డాక్టర్ వీవీ రావు మాట్లాడుతూ ప్రపంచ సంస్కృతులు, మతాలు భిన్నంగా ఉండొచ్చని, కానీ మానవ జాతి అంతా ఒక పెద్ద కుటుంబమన్నారు. అందుకే అంతా కలసిమెలసి సాగాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, డాక్టర్లు వెంకటపతి, గాయత్రి, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

కాకినాడ సిటీ: విద్యా శాఖ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్, పార్టు టైం ఉద్యోగుల సమ్మె 13వ రోజుకు చేరుకుంది. సోమవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. జేఏసీ నాయకులు ఎ.లోవరాజు, జి.నారాయణ, శ్రీనివాస్, పి.రాజు, ఎం.గంగాధర్, సీఐటీయూ నాయకులు చెక్కల రాజ్‌కుమార్, కేవీవీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఓల క్యాలెండర్ ఆవిష్కరణ



కలెక్టర్ కృతికా శుక్లాను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీ ఎన్జీఓ నాయకులు

కాకినాడ సిటీ: ఏపీ ఎన్జీఓల అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏపీ ఎన్జీఓల అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 క్యాలెండర్‌ను కలెక్టర్ కృతికా శుక్లాతో నాయకులు ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుద్దటి రామమోహన్, పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పాలపర్తి మూర్తిబాబు, నరెళ్ల చంద్రరావు, సుజాత, షేక్ అజీజ్, ఎ.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన చిన్న

పెద్దాపురం: ఆటో బోల్తా పడిన సంఘటనలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం స్థానిక వడ్లమూరు రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గోరింట గ్రామానికి చెందిన బొంతు చిన్న ఆటోపై వస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్నకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ సురేష్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

మద్యం మత్తులో ప్రమాదానికి గురైన యువకుడు



ప్రథమ చికిత్స చేస్తున్న హైవే అంబులెన్సు సిబ్బంది

పిఠాపురం: మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ అదుపు తప్పి పడిపోవడంతో ఒక యువకుడికి గాయాలయ్యాయని గొల్లప్రోలు హైవే పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం కత్తిపూడి నుంచి మోటారు సైకిల్‌పై పిఠాపురం వైపు వస్తున్న ఒక యువకుడు మద్యం మత్తులో గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో గాయాలపాలైన అతడిని హైవే అంబులెన్సులో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. యువకుడు ఎవరనేది వివరాలు తెలియాల్సి ఉంది. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వారధి వచ్చే.. అభివృద్ధి మెచ్చే

- రేపు సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- ముత్తా వారధితో ట్రాఫిక్ కష్టాలకు చెక్
- రూ.94 కోట్లతో అభివృద్ధి పనులు
- స్కేటింగ్ రింక్‌తో క్రీడా సౌరభం



ప్రారంభానికి ముస్తాబైన కొండయ్యపాలెం ఆర్వోబీ



సిద్ధమైన స్కేటింగ్ రింక్

కాకినాడ: నగరంలో మూడు ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. ట్రాఫిక్ కష్టాలను తీర్చే ముత్తా గోపాలకృష్ణ వారధిని ప్రజలకు అంకితం చేయడంతో పాటు క్రీడాభిమానులకు ప్రయోజనం కలిగేలా నిర్మించిన స్కేటింగ్ రింక్, రాగిరెడ్డి కళాక్షేత్రం కూడా ప్రారంభం కానున్నాయి. సీఎం రాకకు సంబంధించి పర్యటన తేదీ ఖరారు కావడంతో ఆయా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. రూ.65 కోట్లతో నిర్మించిన ముత్తా గోపాలకృష్ణ వారధి (కొండయ్యపాలెం ఫ్లై ఓవర్) జనవరి మూడో తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అంకితం చేయనున్నారు. 14 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఈ ఫ్లై ఓవర్‌కు అడుగడుగునా అవాంతరాలే ఎదురయ్యాయి. న్యాయపరమైన సమస్యలు, గత పాలకుల నిర్లక్ష్యంతో నిర్మాణం నత్తనడకన సాగుతూ వచ్చింది. సీఎం జగన్ అధికారం చేపట్టాక ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో 14 ఏళ్ల తరువాత ఈ వారధి అందుబాటులోకి రానుంది. భూ సేకరణతో పాటు, నిర్మాణ వ్యయం కలిపి రూ.65 కోట్లు వెచ్చించి దీనిని పూర్తి చేశారు.

రూ.20 కోట్లతో కళాక్షేత్రం

రాజా ట్యాంక్ ఆవరణలో రూ.20 కోట్లు ఖర్చు చేసి అత్యాధునిక వసతులతో రాగిరెడ్డి వెంకట జయరామ్‌కుమార్ కళాక్షేత్రాన్ని నిర్మించారు. సుమారు 770 సీట్ల సామర్థ్యంతో వీక్షించేందుకు వీలుగా సకల సౌకర్యాలతో కళాక్షేత్రం నిర్మితమైంది. చక్కటి వేదిక, ఏసీ, లైటింగ్, సౌండ్ సిస్టమ్‌లను కూడా ఇందులో ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సమావేశాల నిర్వహణకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుంది.



స్కేటింగ్ రింక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి(ఫైల్)



రాగిరెడ్డి కళాక్షేత్రం

రూ.9 కోట్లతో స్కేటింగ్ రింక్

ఇక రాజా ట్యాంక్ ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కేటింగ్ రింక్ నిర్మించారు. చక్కటి వసతులు, నాణ్యతా ప్రమాణాలతో ఇక్కడ ట్రాక్ నిర్మించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు దీనిని తీర్చిదిద్దారు. ఈ ప్రాంతం నుంచి ఎంతో మంది ప్రతిభ కలిగిన స్కేటింగ్ క్రీడాకారులు ఉన్న నేపథ్యంలో ఇక్కడ నిర్మిస్తున్న స్కేటింగ్ రింక్ ఈ ప్రాంతానికి ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది.

సీఎంతో ప్రారంభోత్సవం

కళాక్షేత్రం, స్కేటింగ్ రింక్, ఆర్వోబీలను సీఎం జగన్ ప్రారంభించనున్నారు. ముత్తా గోపాలకృష్ణ వారధి ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. నగరంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నాం.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే, కాకినాడ సిటీ

పాళమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం పూర్తి



ప్రారంభోత్సవానికి సిద్ధమైన పాళమ్మ తల్లి ఆలయం

కరప: పెనుగుదురు గ్రామ దేవత పాళమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ నెల 4న ఉదయం 8.13 గంటలకు రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతుల చేతుల మీదుగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిపేందుకు సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, ఎంపీటీసీ సభ్యురాలు బందారు సుజాత ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామస్తులు తమ ఇలవేల్పుగా కొలిచే పాళమ్మ తల్లి ఆలయం శిథిలావస్థకు చేరడంతో ప్రజల వినతి మేరకు ఎమ్మెల్యే కన్నబాబు స్పందించి ఆలయ పునర్నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేయించారు. పది నెలల కిందట భూమిపూజ చేశారు. ఈ పనులు పూర్తి కావడంతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య దంపతులు, సర్పంచ్ వెంకటమాధవి, రమేష్, ఎంపీటీసీ సభ్యులు సుజాత, వెంకటేశ్వరరావు దంపతులు తదితర గ్రామస్తులతో కలసి హోమం ఇతర పూజలు నిర్వహిస్తారు. ఈ పూజాదికాలను కోనసీమ వాస్తవ్యులు బ్రహ్మశ్రీ ఉపద్రష్ట లక్ష్మీనరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో పండితులు 2, 3 తేదీల్లో నిర్వహిస్తారు. 4న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుంది.

దిగ్విజయీభవ.. ఆనందం వెల్లివిరియాలి



రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నబాబుకు గజమాలతో సత్కారం



కన్నబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ట్యాంక్ లారీ ట్రాన్స్‌పోర్టర్ల నాయకుడు బాలకృష్ణ

- కొత్త వత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: కొత్త ఏడాది దిగ్విజయంగా సాగాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని.. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయం సాధించాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. సోమవారం రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించారు. అర్ధరాత్రి అభిమానులు, నాయకులతో కలసి కేక్ కట్ చేసిన ఆయన సోమవారం ఉదయం ప్రత్యేక శిబిరంలో అందుబాటులో ఉన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పాటు జిల్లాలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు, అధికారులు, పోలీసు, ఎస్సీఎఫ్, ఫైర్, ఎక్సైజ్ తదితర శాఖల సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాలు, నాయకులు పెద్దఎత్తున పుష్పగుచ్ఛాలు, కేకులు, పూలమొక్కలు తదితర వాటితో తరలివచ్చి తమ అభిమాన నాయకుడు కన్నబాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఆయన శిబిరంలో వేదికపై ఉండి ప్రజల విజ్ఞప్తులను ఆలకించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు, మహిళలు అంతా బాగుండాలన్నారు. 2024 వరకూ సంక్షేమ సంవత్సరంగా గడిచిందని, ప్రతి కుటుంబానికి మేలు చేసేలా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాకినాడ రూరల్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అన్ని చోట్లా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుకుంటున్నానన్నారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ నాగనరసింహారావు, ఎస్సీఎఫ్ అడిషనల్ కమాండెంట్ బసవా శ్రీనివాసరావు, డీఎస్పీలు మురళీకృష్ణారెడ్డి, మురళీమోహన్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జమ్ములమడక నాగమణి, ట్యాంక్ లారీ ఓనర్స్, వర్కర్స్, ట్రాన్స్‌పోర్టర్స్ తరఫున బాలకృష్ణ తదితరులు, రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సినీ దర్శకుడు కల్యాణ్‌కృష్ణ, ఎంపీపీలు గోపుశెట్టి పద్మజ బాబ్జీ, జేఎన్‌టీయూకే వీసీ సభ్యుడు బెజవాడ సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్లు గీసాల శ్రీను, కర్నాకుల సీతారాంజనేయులు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ వలసపాకల గ్రామంలో, ఎంపీపీ గోపుశెట్టి పద్మజ కొవ్వాడలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు.

ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు

కరప: మండలంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. యువకులంతా రోడ్లపైకి వచ్చి కేరింతలు కొడుతూ సందడి చేశారు. కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ, సిబ్బందితో కలసి పెట్రోలింగ్ జరిపి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు కాకినాడకు వెళ్లి ఎమ్మెల్యే కురసాల కన్నబాబును, అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీ డైరెక్టర్ చింతా ఈశ్వరరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని కోరుతూ చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావులను మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు, రేషన్ డీలర్లు, ఉపాధి పథకం సిబ్బంది తదితరులు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

న్యూ ఇయర్ వేడుకల్లో ఎమ్మెల్యే ద్వారంపూడి



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: నూతన సంవత్సరంలో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆకాంక్షించారు. స్థానిక వెంకటనగర్‌లోని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన అనేక మంది అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులు తరలివచ్చి ఎమ్మెల్యే ద్వారంపూడికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పారు. పలువురు కేక్ కట్ చేశారు. మరికొందరు గజమాలలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారని, ఆయన ద్వారా మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా నూతన సంవత్సరం ఉండాలని ఆకాంక్షించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. తద్వారా ప్రజలకు మరిన్ని మంచి పనులు జరుగుతాయన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసిన వారిలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ లావణ్యకుమారి, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, చోడిపల్లి ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పలువురు ప్రముఖులను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి తదితరులను ఎమ్మెల్యే కలిసి న్యూ ఇయర్ విషెస్ తెలిపారు.

- ఎంపీ వంగా గీత నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కమిషనర్ నాగనరసింహారావు, పిఠాపురం నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు ఎంపీ వంగా గీతను మర్యాదపూర్వకంగా కలిశారు.

మెరుగైన పాలన దిశగా అడుగులు

ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించే దిశగా ప్రతి అధికారి కష్టించి పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు అధికారులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పలువురిని కలసి న్యూ ఇయర్ విషెస్ చెప్పారు.



ఎంపీ వంగా గీతకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న కమిషనర్ నాగనరసింహారావు



కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే ద్వారంపూడిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

రోడ్ షో విజయవంతం చేయాలి



హాజరైన జిల్లా స్థాయి అధికారులు

కమిషనర్ నాగ నరసింహారావు ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 3న నిర్వహించనున్న రోడ్ షోను విజయవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో జిల్లా స్థాయి, కార్పొరేషన్ ప్రత్యేక అధికారులు, ఆర్పీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వరకూ ఏర్పాటు చేసిన రోడ్ షో విజయవంతానికి ఆయా శాఖల అధికారులు పటిష్టవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సుమారు 750 మీటర్ల పరిధిలో జరిగే ఈ రోడ్ షోలో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, మెప్మా పీడీ ప్రియంవద, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు నూతన సంవత్సరం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జామున స్వామివారికి జరిగే తొలి అభిషేకం, పూజలను తిలకించడానికి బారులు తీరారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు తెల్లవారు జామున పిఠాపురం మహారాజా గోత్రనామాలతో పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు ఆలయంలోని ఉప ఆలయాలు, మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు జరిగాయి. పూజల అనంతరం సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానంలోని అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్‌లు పూజా కార్యక్రమాలు చేపట్టారు.

ఆధ్యాత్మిక వైభవం.. ఆనంద పరవశం



గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్యూ కట్టిన భక్తులు



సముద్ర జలాల పూర్ణకుంభానికి విష్ణు హారతి ఇస్తున్న శ్రీవారి భక్తులు



కృష్ణావతారంలో దర్శనమిచ్చిన సీతారామస్వామి

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బోట్‌క్లబ్‌: కొత్త సంవత్సరం వేళ ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. సోమవారం నగరంలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ధనుర్మాసం సందర్భంగా నగరంలోని విష్ణాలయాలతో పాటు వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ రద్దీ నెలకొంది. దర్శనం కోసం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడాల్సి వచ్చింది. స్థానిక జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి, వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయాలు, మెయిన్‌రోడ్డు సీతారామస్వామి, దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వయం భూ భోగి గణపతి పీఠంలో సముద్ర జలాల పూర్ణ కుంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలతో శ్రీమహావిష్ణు హారతి ఇచ్చారు. తొలుత గణపతికి 813వ జపయజ్ఞ పారాయణ పూర్తి చేసి, సామూహిక విష్ణుసహస్ర నామ పఠనం చేశారు. పీఠం వ్యవస్థాపక ఉపాసకుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ పుణ్య దినోత్సవాల్లో ఏడాదికి ఒకసారి సముద్ర స్నానం చేయడం సముద్రునికి విష్ణు హారతి సమర్పించడం హైందవ సంస్కృతి అన్నారు. తీరానికి వెళ్లలేని పక్షంలో సముద్ర జలాలను పూజా మందిరంలో కుంభంగా నిలిపి విష్ణు ఆరాధనతో ఆ జలాలను శిరస్నానం చేయడం మంగళకరమన్నారు. భారీ సంఖ్యలో శ్రీవారి భక్తులు పాల్గొన్నారు.

కృష్ణావతారంలో సీతారామస్వామి

స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా స్వామివారు కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు భావనరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.